సంతతో రాకపోకలకు పాట్లు



సంతలో జనం రద్దీ

నవాబుపేట: మండల కేంద్రంలో సంత అంటేనే రోడ్డుతో చింత అనే విషయం గుర్తుకువస్తుంది. ఆదివారం వచ్చిందంటే మండల కేంద్రం నుంచి వెళ్లే దారులన్నీ బంద్ అవుతాయి. వందలాది మంది జనం కనీసం నడవటానికి కూడా రానంతగా 3 కిలోమీటర్ల పొడవులో సంత సాగుతుంది. దీంతో సంత అవతలి గ్రామాలకు వెళ్లాలంటే ఆదివారం సాయంత్రం 6దాటిన తరువాతే వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. లోకిరేవు, లింగంపల్లి, రేకులచౌడాపూర్, కాకర్జాల్, తండాలకు పూర్తిగా దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు సైతం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..



సంతకు వచ్చే జనంతో రోడ్డు రద్దీగా మారుతున్న మాట వాస్తవమే. రోడ్డు సమస్యకు పరిష్కారం చూస్తాం. అలాగే మార్కెట్‌కు వచ్చే వారికి కనీస సౌకర్యాలకు కల్పించేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో సౌకర్యాలు కల్పిస్తాం.

– గోపాల్‌గౌడ్, సర్పంచ్, నవాబుపేట

బీఎస్పీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

నవాబుపేట: బీఎస్పీని మండలంలో బలోపేతం చేస్తామని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగుతున్న పార్టీ లక్ష్యాన్ని బహుజనులకు వివరించి, వారిని చైతన్యం చేసి ఒక్కతాటిపైకి తీసుకువస్తామని వివరించారు. అనంతరం మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ నాయక్, కార్యదర్శులుగా వెంకటేష్, శివకుమార్, కోశాధికారిగా వెంకట్రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సైతం కమిటీలు ఏర్పాటు చేసి మండలంలో పార్టీకి మంచి క్యాడర్ రూపొందించినట్లు ఆయన వివరించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, పవన్‌కుమార్, అంజన్న, ఆంజనేయులు, లక్ష్మణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

మహవీర్ పరిశ్రమ మూసివేతకు డిమాండ్



గ్రామస్తులకు మద్దతు తెలిపిన నాయకులు

బాలానగర్: మండలంలోని గుండేడ్ శివారులో కాలుష్యానికి కారణమవుతున్న మహవీర్ పరిశ్రమను మూసివేసే వరకు గ్రామస్తులు నిరసన తెలిపారు. ధర్నా కార్యక్రమం 20రోజులు పూర్తవడంతో బీఆర్‌ఎస్ తరఫున మండల అధ్యక్షుడు పుల్లమరాజు శ్రీనివాస్ రావు, మండల వైస్ ఎంపీపీ వెంకటచారి తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, కార్మిక విభాగం అధ్యక్షుడు గోకుల్ నర్సింహులు ఆచారి, యాదయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భద్రూనాయక్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన చొక్కంపేట్ సుకుమార్ కూతురు మానస వివాహానికి ఆదివారం దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి అందించిన రూ.10వేలను ఎంపీటీసీ సభ్యుడు శేఖర్‌గౌడ్ ఆదివారం కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులు, చింతల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈకుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకుబేర్ రావడం వల్ల ఉపాధ్యాయులను అప్పులపాలు చేసిందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనలకు పిలుపునిస్తామన్నారు. యూటీఎఫ్ ఎమ్మెల్సీ అధికార అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పండిట్ పీఈటీలను అప్‌గ్రేడ్ చేసి వారిని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో బ్యాంకింగ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా మారిందని, అందుకు బ్యాంకింగ్‌పై అవగాహన ఎంతో అవసరం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల ఫైనాన్షియల్ లిటరసీ వీక్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎస్వీడీసీ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్రగాయాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రైల్వేగేట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం రైలుపట్టాలు దాటుతున్న గోపెనాగమ్మ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన వృద్ధురాలు పాతబజార్ వైపు నుంచి వస్తూ గేట్ దాటుతుండగా, అదే సమయంలో వస్తున్న రైలు ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలైన వృద్ధురాలిని స్థానికులు 108 సహకారంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కణతి తొలగింపు

జడ్చర్ల టౌన్: జనరల్ అనెస్తీషియాతో మహిళకు ఆదివారం రొమ్ములో కణతి తొలగించినట్లు పట్టణంలోని పీవీఆర్ ఆస్పత్రి వైద్యుడు పలమనాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మహిళ రొమ్ములో 10సెం.మీ. వెడల్పు, విస్తీర్ణంతో దాదాపు కిలో బరువు ఉన్న కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. మహిళకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో వెన్నుముకకు అనెస్తీషియా ఇవ్వకుండా జనరల్ అనెస్తీషియాతో శస్త్రచికిత్స చేశామన్నారు. సర్జన్ డా.గాయత్రి, అనెస్తీషియా డా.రాఘవేందర్‌ల సహకారంతో శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మహిళ కోలుకుంటుందని తెలిపారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన జేఏసీ నాయకులు



కోయిల్‌కొండ: రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును గార్లపహాడ్ జేఏసీ మండల నాయకులు ఆదివారం అసెంబ్లీలో కలిసి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కోరారు. 44 గ్రామ పంచాయతీలుగా అతిపెద్ద మండలంగా ఉన్న కోయిల్‌కొండను రెండో మండలంగా గార్లపహాడ్‌ను ఏర్పాటు చేయాలని, 16గ్రామల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుకుంటున్నారని వినతిలో పేర్కొన్నారు. ఇందుకు మంత్రి హరీశ్‌రావు మండల ఏర్పాటును పరిశీలిస్తామని, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ మండల కన్వీనర్ రామునాయక్, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

జాతీయ మహాసభలకు ఎంపిక

మహబూబ్‌నగర్ రూరల్: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ పదో మహాసభలకు జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ ప్రతినిధిగా ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం బెంగాల్ రాష్ట్రంలోని హౌర పట్టణంలో జరిగే మహాసభల్లో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని మోహన్ తెలిపారు.

ఇంటర్నేషనల్ కరాటే టోర్నీలో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో సాలం బిన్ ఉమర్, మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఆదివారం ముగిసిన మొదటి ఓపెన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ (సీఎం కప్)లో డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ పట్టణ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మాస్టర్ ఎస్‌కే మోసీన్ తెలిపారు. ఈ పోటీల్లో కుమితే విభాగంలో విద్యార్థులు రెండు బంగారు, రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్–12 విభాగం కుమితేలో ఆర్.సాయినాథ్‌రెడ్డి శ్రీలంక, బంగ్లాదేశ్, సౌది అరేబియా క్రీడాకారులపై గెలుపొంది బంగారు పతకాన్ని సాధించినట్లు వెల్లడించారు. అండర్–10 విభాగం కుమితేలో కె.మహీధర్ రజత పతకం, అండర్–9 విభాగం కుమితేలో మనోవికాస్ కాంస్య పతకం, అండర్–12 విభాగంలో సింధూర కుమితేలో కాంస్య పతకం పొందారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అప్రేష్, ఉపాధ్యక్షుడు అంజన్‌ప్రసాద్, మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు ఎస్‌కే మోసీన్, మాస్టర్లు ఫహీం, అర్బాజ్, సలీం తదితరులు అభినందించారు.

పింఛన్లు ఇవ్వాలని నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు, గ్రామస్తులు

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్‌లో అర్హులకు పింఛన్లు అందించాలని ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సర్పంచ్ జంగయ్య మద్దతు తెలిపి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నకిష్టమ్మ, జంగమ్మ, గోవిందమ్మ, అంజమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జింఖానా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభచాటినట్లు బీవీపీ పాలమూరు శాఖ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో కబడ్డీ పురుషుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 200మీటర్ల పరుగులో ఆర్.శివ, షాట్‌పుట్‌లో సిద్ధూ మూడోస్థానం పొందినట్లు తెలిపారు. క్రీడాకారులను బీవీపీ ప్రతినిధులు అభినందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీవీపీ ప్రతినిధులు జి.పాండురంగం, పి.రమేష్ చందర్, వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, నాగేంద్ర స్వామి, దేవేందర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు



బెల్టులు సాధించిన విద్యార్థులతో ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపుతో పాటు మానసికంగా దృఢంగా ఉండవచ్చని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ మాస్టర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. పిల్లలు కరాటే నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ మాట్లాడుతూ కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభచాటినట్లు తెలిపారు. 12 మంది విద్యార్థులు ఎల్లో బెల్టు, 9 మంది విద్యార్థులు ఆరెంజ్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, కోటకదిర నర్సింహులు, మహేందర్, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ వక్త బస్వరాజు పాటిల్

కల్వకుర్తి టౌన్: ప్రస్తుత నవీకరణ సమాజానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు అవసరమని ప్రముఖ వక్త, భారతీయ విద్యా ఉత్సవ్ సభ్యుడు బస్వరాజు పాటిల్ అన్నారు. మూడు రోజులుగా పట్టణంలోని అక్షరవనంలో 'విద్యార్థులకు ఎలా బోధిస్తే వారు అవగతం చేసుకుంటారనే' అంశాలపై భారతీయ విద్యాఉత్సవ్ పేరుతో నిర్వహించిన వర్క్‌షాపులు ఆదివారంతో ముగిశాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో విద్యావ్యవస్థపై అధ్యయనం చేయడానికి ఇలాంటి చాలా వర్క్‌షాపులకు హాజరై చాలా విషయాలను తెలుసుకున్నానని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు తరగతి పాఠాల కన్నా ఇతర అంశాలతో పాటుగా తరగతులను నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారన్నారు. వాటికి అనుగుణంగా విద్యార్థులకు పాఠాలను ఎలా బోధించాలనే విషయాలపై ఉపాధ్యాయులు ప్రిపేర్ అయి ఉండాలని అన్నారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా ఆరుగురు వక్తలు క్రియేటివ్ టీచింగ్‌తో పాటుగా పలు ఇతర అంశాలపై పాఠశాలలో అవలంబించాల్సిన పద్ధతులపై వక్తలు ప్రసంగించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముళ్లపొదలు తొలగించండి



రోడ్డుకు ఇరువైపుల కమ్ముకున్న ముళ్లపొదలు

మరికల్: మండలంలోని మాధవరం నుంచి కిష్టాపూర్ వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో దారిలోని ఆయా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరోపక్క మాధవరం శివారులో ఉన్న ప్రభుత్వ భూముల నుంచి రాత్రి సమయంలో టిప్పర్లతో మట్టిని తరలిస్తుండడంతో రోడ్డు గుంతలమయంగా మారిందంటున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని న్యూమోతీనగర్‌లో పోచమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తాళ్లపాక మణికంఠ శివాచార్య ఆచార్యత్వంలో ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం గవ్యాంత పూజలు, యంత్రస్థాపన, బింబస్థాపన, మూలమంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ, మహాకుంబాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాజీ జయంతి నిర్వహించాలి



మాట్లాడుతున్న జగదీశ్వర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని గ్రామగ్రామాన ఈనెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో ఆదివారం వీహెచ్‌పీ జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగదీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని గ్రామాల్లోని యువకులు శివాజీ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వీహెచ్‌పీ ప్రాంత సంఘటన కార్యదర్శి ముదుపు యాదిరెడ్డి మాట్లాడుతూ యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి ఫిబ్రవరి 14న ఒక విదేశీ వ్యక్తి వాలంటైన్స్ పేరుమీద ప్రేమికుల రోజు నిర్వహించుకోవడం దారుణమని, దీన్ని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రేమికుల రోజుని జరుపుకో వద్దని వీహెచ్‌పీ పిలుపునిస్తున్నదని, అదే రోజు దేశం కోసం ప్రాణాలర్పించి పుల్వామా దాడి జరిగే అనేక మంది సైనికులు వీరమణ పొందారని, అందువల్ల సైనికులను ఆదర్శంగా తీసుకొని వారినే స్మరించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఎ.నరేందర్, బుచ్చారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీధర్‌బాబు, బుట్ట శ్రీను, గుబ్బ భరత్, జనార్దన్, సురేష్, రాజేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మహమ్మదాబాద్: గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి ప్రభుత్వం సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని షేక్‌పల్లిలో రూ.5లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మారుమూల పల్లెలు అభివృద్ధికి నోచుకోక ఎన్నో అవస్థలు పడుతున్న సమయంలో ప్రభుత్వం గ్రామలను, తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్‌హసీబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. బహుదూరం



నవాబుపేటలోని పశువైద్యశాల

నవాబుపేట: మండలానికి పశువైద్యం బహుదూరమైంది. జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న మండలం పశువైద్యం విషయంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో మొత్తం రెండు ప్రధాన ఆస్పత్రులతో పాటు ఏడు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం. కనీసం ఇద్దరు డాక్టర్లు, సిబ్బంది ఉండాల్సిన మండలంలో ఒక డాక్టర్ పోస్టుతో పాటు 7 కంపౌండర్, 3 ఎల్‌ఎస్‌ఎల్, మరో 4 ఇతర ఇబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలం మొత్తం కేవలం కొల్లూర్ ఆస్పత్రిలో మాత్రమే డాక్టర్ అందుబాటులో ఉండగా, మిగతా వాటి పరిస్థితి దారుణంగా మారింది. కాకర్లపహాడ్, కారుకొండా పశు ఆస్పత్రుల్లో ఎల్‌ఎస్‌ఎల్ సిబ్బంది సైతం అందుబాటులో లేరు. అలాగే ఇప్పటూర్, లింగంపల్లి, పోమాల్, చౌడూర్ ఆస్పత్రుల్లో కంపౌండర్లు సైతం లేరు. కాగా, కేవలం ఇద్దరు కంపౌండర్లతోనే మండలం మొత్తం పశువైద్యం కొనసాగుతుంది. మండలంలో 54 పంచాయతీలు, 27 గిరిజనతండాలతో పాటు మరో 10 మదిర గ్రామాలు ఉంటాయి. కంపౌడర్ చేసిన వైద్యంతో నయమైతే సరి. లేదంటే రైతులు ఆ పశువులపై ఆశ వదులుకోవాల్సిందే. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



కంపౌండరే మాకు డాక్టర్‌గా మారారు. పశువుకు ఏదైనా జరిగితే కంపౌండర్ చేసిందే వైద్యం. డాక్టర్‌తో వైద్యం కావాలంటే ప్రత్యేక వాహనం మాట్లాడి డాక్టర్ ఉన్న చోటుకు పశువును తీసుకుని వెళ్లాలి. స్థానికంగా వైద్యుడు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– రాములు, కొండాపూర్

ఉన్న సిబ్బందితో సేవలు అందిస్తున్నాం..

ఉన్న సిబ్బందితో రైతులకు సేవలు అందిస్తున్నాం. రైతులు పొలం వద్ద ఉండి సమాచారం అందించినా వైద్య సిబ్బందిని పంపించి వైద్యం చేయిస్తున్నాం. మరో మండలం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు ఇవ్వటంతో ఇబ్బందులు తలెత్తాయి. మండల కేంద్రంలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

– డాక్టర్ రవిచంద్రన్, కొల్లూరు, పశువైద్యాధికారి